# జైసే కో తైసా

## ఎర్రమిల్లి శేఖర్

ఆఫీసు నుంచి వచ్చి కుర్చీలో కూర్చుని షూస్ విప్పుకుంటున్నాడు ఉమాపతి. కాఫీ కప్పుతో లోపలినుంచి వచ్చింది హైమ. కప్పు అందుకుంటూ ఆమె వంక చూసి ఆశ్చర్యంతో తలమునకలైనాడు ఉమాపతి.

హైమలో వచ్చిన మార్పే అందుకు కారణం. పక్క పాపిడి తీసి అల్లుకున్న జడ, నుదుట నయాపైసంత ఎర్రటి గుండ్రటి తిలకం, సిగలో సన్నజాజులు, చెవులకి ముత్యాల దుద్దులు, ఒంటిని బిగుతుగా అంటిపెట్టుకునేలా కట్టుకున్న చీర, కాలర్ చోళీ-

"ఏమిటి అలా చూస్తున్నారు? కాఫీ చల్లారిపోతుంది తాగండి" అన్నది హైమ రేడియో ట్యూన్ చేసి వచ్చి ఈజీ ఛెయిర్‌లో కూర్చుంటూ.

రేడియోలోంచి వస్తున్న కర్ణాటక సంగీతం మంద్రంగా గదంతా పరుచుకుంటూంది. కాఫీ సిప్ చేస్తూ ఉమాపతి జ్ఞాపకాల్లోకి జారిపోయాడు.

సాటి ఆడవారు చూసి అసూయ పడేంత అందం లతది. ఆమె ఉమాపతి మేనమామ కూతురు. లత కట్టుకుంటే బట్టలకే అందం వచ్చేది. ఆమెను చూడటం కోసమే కొందరు స్టూడెంట్స్ రోజూ కాలేజీకి వచ్చేవాళ్ళు అంటే అతిశయోక్తి కాదు. అందంలోనే కాదు - చదువులో కూడా ఆమెకు తిరుగులేదు. డిగ్రీలో కాలేజీ ఫస్టొచ్చింది - పీ.జీ.లో గోల్డ్ మెడల్ తెచ్చుకుంది. చాలామంది అబ్బాయిలు ఆమెను పెళ్ళి చేసుకోవాలని ఉవ్విళ్ళూరారు - కొందరు అబ్బాయిల తల్లితండ్రులు వాళ్ళింటి చుట్టూ తిరిగారు. వాళ్ళలో చాలామంది స్థితిపరులు, సంఘంలో పలుకుబడి, హోదా ఉన్నవాళ్ళు. అలాంటి లతను తనకి ఇస్తానని మేనమామ రావటం ఉమాపతికి ఆశ్చర్యం కలిగించింది.

ఉమాపతికి తండ్రి సంపాదించిన ఇల్లు తప్పిస్తే వేరే ఆస్తి లేదు. పైగా నెలకు పదిహేను రోజులు ఊళ్ళు పట్టుకొని తిరిగే రిప్రజెంటేటివ్ ఉద్యోగం.

"లతను చేసుకుంటామని చాలామంది వస్తున్నారు - కాని లత మాత్రం నిన్నే చేసుకుంటానని అంటూంది."

మేనమామ మాటలకు ఉమాపతిలో గర్వం తొంగిచూసింది. లత మెడలో మూడు ముళ్ళు వేస్తున్నప్పుడు అంతటి అందం అతని స్వంతమైనందుకు ఆ గర్వం రెట్టింపయింది.

ఉమాపతి లతను ప్రాణంలా ప్రేమించాడు, ఆమె తోడిదే లోకంగా జీవించాడు. కాని అతని కాపురం మూడేళ్ళు ముచ్చటైంది. కాలం అతని భార్యను కాలదన్నుకుపోయింది. లత యాక్సిడెంట్‌లో చనిపోయింది. వేగంగా వస్తున్న లారీ రోడ్ క్రాస్ చెయ్యబోతున్న లతను పొట్టన బెట్టుకుంది. అంతటి అసమానమైన అందం నడిరోడ్డుమీద నెత్తుటి ముద్దగా మిగిలింది.

లత లేని జీవితం ఉమాపతికి శూన్యంగా అనిపించింది.

అతను ఆ షాక్ నుంచి తొందరగా కోలుకోలేకపోయాడు. లత తండ్రి మాత్రం తొందరగానే కోలుకున్నాడు. లత చెల్లెలు హైమని చేసుకోమని ఉమాపతిని అడిగాడు. ఉమాపతి అంగీకరించలేదు - లతతో గడిపిన రోజుల జ్ఞాపకాల తడి ఇంకా అతని మనసులో ఆరలేదు.

"లతను నువ్వు మరిచిపోలేకపోతున్నావని నాకు తెలుసురా, కాని చూడు, పోయిన వాళ్ళకోసం బాధపడుతూ కూర్చోవటం కంటే ఉన్న వాళ్ళకు సహాయం చెయ్యటం మంచి లక్షణం - నాకు తెలుసు-నీకూ, హైమకీ పదేళ్ళ వార ఉంది. అయినా హైమను చేసుకోమని ఎందుకు ప్రాధేయపడుతున్నానో అర్థం చేసుకో, ఎవడో సురేషట, ప్రేమ ప్రేమంటూ వాడి వెంట తిరిగింది అందరి కళ్ళలోనూ పడింది. వాడు దీన్ని మోసం చేసి ఎవరినో కట్టుకున్నాడు. అది విన్న దగ్గర్నుంచి నా గుండెలో రాయి పడింది. ఈ స్థితిలో నువ్వు కాదంటే దానికి పెళ్ళి కావటం అసంభవం" అన్నాడు ఉమాపతి మేనమామ.

ఈ మాటలు విన్నాక ఉమాపతి మెత్తపడ్డాడు. హైమను పెళ్ళి చేసుకున్నాడు. లతంత కాకపోయినా హైమ కూడా అందంగానే ఉంటుంది.

కానీ ఇలా ఈ రోజు ఉన్నట్లుండి హైమ లతను ఎందుకు అనుకరిస్తుందో అర్థం కాలేదు ఉమాపతికి. "నువ్వు మీ అక్కను ఎందుకు అనుకరిస్తున్నావు?" అన్నాడు కాఫీ కప్పు పక్కన పెడుతూ.

"మా అక్కంటే నాకు ఆరాధన. చిన్నప్పటి నుంచి ఆమెను అనుకరిస్తూనే ఉన్నాను. ఆమె బట్టలు కట్టుకున్నాను. ఆమె పుస్తకాలు చదువుకున్నాను. చివరికి ఆమె భర్తను కూడా పెళ్ళి చేసుకున్నాను" అన్నది హైమ - మెడలో మంగళసూత్రాల్ని సరిచేసుకుంటూ.


"ఎవరికి వాళ్ళు సహజంగా జీవించాలి హైమ. ఒకరిని అనుకరించటంలో అందం లేదు. ప్లీజ్ నా మాట మన్నించు. కట్టూ, బొట్టూ, నడకా, మాటల్లో లతను అనుకరించి నాలో మానుతున్న బాధను మళ్ళీ రేపకు !" అన్నాడు ఉమాపతి.

హైమ మాట్లాడలేదు - మెత్తగా నవ్వింది.

ఆ నవ్వులో ఉమాపతికి లత పోకడలు కనిపించాయి.

** ** **

హైమను మార్చాలని ఉమాపతి చాలా ప్రయత్నాలు చేశాడు. కానీ ఏ ఒక్క ప్రయత్నమూ ఫలించలేదు. ఉమాపతికి ఏం చెయ్యాలో పాలుపోలేదు. సరిగ్గా ఆ సమయంలో సురేష్ ఉమాపతి ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్‌మీద వచ్చాడు. అందమైన విగ్రహం, నొక్కుల జుత్తు, నవ్వుమొహం. సురేష్‌ను చూడగానే ఎవరికైనా ప్లీజింగ్‌గా అనిపిస్తుంది.



అతన్ని చూడగానే ఉమాపతికి ఒక ఆలోచన

వచ్చింది. వారం రోజుల పాటు అతని మోటారు సైకిల్ కావాలని సురేష్‌ను అడిగాడు. టూరుకు వెళుతున్న సురేష్ ఉమాపతి కోరికను కాదని అనలేదు.

** ** **

తలమీద కేప్, పొట్టి చేతుల చారల బనీను, జీన్స్ పాంటు, స్పోర్ట్స్ షూస్ ఆ వేషంలో ఉమాపతిని చూసి ఆశ్చర్యపోయింది హైమ.

"హైమా ! సాయంత్రం నేను వచ్చేసరికి రెడీగా ఉండు. సినిమా కెళదాం" అన్నాడు ఉమాపతి సిగరెట్ పొగ వదుల్తూ. అతను మాట్లాడుతున్నప్పుడు మధ్య మధ్య భుజాలు ఎగరేస్తున్నాడు. ఆమె పెదాల మీద సున్నితంగా ముద్దు పెట్టుకుని బయటకు నడిచాడు.

అతను వెళుతున్న మోటార్ సైకిల్ చూసి హైమ నిశ్చేష్టురాలైంది హైమ. ఆ మోటార్ సైకిల్‌మీద సురేష్‌తో కలిసి తిరిగిన రోజులు ఆమె మదిలో మెదిలాయి.

** ** **

మోటార్ సైకిల్ మీద పోయేటప్పుడు అతన్ని హత్తుకొని కూర్చోమని అనటం. సినిమా హాల్లో ఏవో చిలిపిపనులు చెయ్యటం - హైమకి అన్నీ కొత్తగా, వింతగా అనిపించాయి.

"ఏమిటి పిచ్చివేషాలు? ఏమయిం దీ రోజు మీకు?" అన్నది హైమ రాత్రి ఉమాపతి పక్కన చేరుతూ.



"సారీ, హైమా ! ఈ విషయంలో దయచేసి నాకు అడ్డు చెప్పకు. మా ఆఫీసులో సురేష్ అని ఒక కొలీగ్ ఉన్నాడు. కొద్ది రోజుల పరిచయంలోనే అతనంటే నాకు చెప్పలేని ఇష్టం ఏర్పడింది. ఆ ఇష్టాన్ని ఇదిగో ఇలా అతన్ని అనుకరించటం ద్వారా వ్యక్తం చేస్తున్నాను" అన్నాడు ఆమెకు దగ్గరగా జరుగుతూ.

సురేష్ ప్రస్తావన రాగానే ఆమె ముఖం మ్లానమైంది.

"సురేష్ నీకు తెలియని వాడేం కాదు - నీతో పరిచయం ఉన్న వ్యక్తే" అన్నాడు ఉమాపతి ఆమెను కవ్విస్తున్నట్లుగా.

ఆమె పలకలేదు. మౌనాన్ని ఆశ్రయించింది.


ఉమాపతి పథకం పారింది. హైమలో చలనం ప్రారంభమైంది. ఉమాపతికి లోపల్లోపల చాలా సంతోషంగా ఉంది. అయినా అతను ఆ సంతోషం పైకి కనపడకుండా జాగ్రత్తపడ్డాడు.

మంచుగడ్డ మెల్లగా కరగటం ప్రారంభమైంది.

"దయచేసి నా మాట వినండి. ఇలా ఉంటే మీరు ఏం బాగాలేరు" అన్నది హైమ.

"వద్దు హైమా, ఈ విషయం మాత్రం చర్చకు తేవద్దు. ఎవరి కిష్టమైన పద్ధతిలో వాళ్ళుంటారు. మీ అక్క అంటే నీకు ఆరాధన, ఆమెలాగా ఉండాలని నువ్వు అనుకోవటం లేదూ? అలాగే నాకు సురేష్ అంటే ఇష్టం కలిగింది, కనుక అతనిలాగా ఉండాలని ప్రయత్నిస్తున్నాను. ఒకరికోసం ఒకరు మారాల్సిన అవసరం ఏమాత్రం లేదు" అన్నాడు ఉమాపతి.

"అయింది చాలు. ఇక పొడిగించకండి. నేను రేపటి నుంచి మారిపోతాను" అన్నది హైమ.



"రియల్లీ?" అన్నాడు ఉమాపతి ఆమె చుబుకాన్ని తన చూపుడు వేలితో పైకెత్తుతూ.

ఆమె కళ్ళతో తన అంగీకారం మరోమారు తెలియజేసింది.

మనసులో సురేష్‌కి థాంక్స్ చెప్పుకుంటూ ఉమాపతి ఆమెను కౌగిట్లోకి తీసుకున్నాడు.

*